# శారద లేఖ

## సౌభాగ్యవతి కల్పలతకు

నెచ్చెలీ! - స్త్రీకి! స్వాతంత్ర్య విరహితయైన స్త్రీకి! దాస్య జీవియైన స్త్రీకి! పురుషుని సొత్తైన స్త్రీకి! హృదయమే లేని స్త్రీకి! మానవత్వమే అంగీకరింపబడని స్త్రీకి విద్యయా! పట్టములా! బిరుదులా! సమ్మానములా! కంకణ మర్యాదలా! ఎంత ఉదార హృదయుడగు భావ సంచారియైనను, ఎంత కలికాలమైనను, ఎంత నాగరికత పెచ్చు మీరుచున్నను, ప్రపంచ పరివర్తన మెంతగ గమనించుచున్నను, సహించుటెట్లు? స్త్రీకి వివేకముండునా! చదువువచ్చునా? వచ్చినను దానిని సద్వినియోగము చేయునా? ఒకవేళ తెలుగు చదువుమాటయేమోగాని ఆమెకు ఏ,బి, సీ డీ లే వచ్చిన పట్టపగ్గములుండునా! ఆమెకు బుద్ధి జ్ఞానములు మొదలేయుండవు. పరువు మర్యాద లేమాత్రము పాటింపదు. నీతి నియమలు లేశమైన లెక్కచూడదు. ఆమె పెండ్లి ఆడనే ఆడదు, ఆడినను పెనిమిటి ననుసరించదు, అనుసరించినను గౌరవముతో చూడదు. వేలుగడించు వకీలునైనను రెవికలు, చీరలు, చేతికందించు మనును; స్నానమునకు నీళ్లుతోడు మనును; పొయ్యి అంటించు మనును; కాఫీ కాచు మనును; వంట జేయు మనును; తాను తినగా మిగిలినది అతనిని గతుకు మనును. తమకెంత సిరి సంపదలుండినను, మగడెంత సంపాదనపరుడైనను పనివారినైన బెట్టుకొనుట కామె యిష్టపడదు. పెనిమిటి చేతనే సమస్త గృహకృత్యములు నిర్వర్తింపజేయుట ఆమె అభీష్టము. అసలు చదువుకొనిన ఆడుదానిని పెండ్లాడిన పురుషునకు నోరు ఉండదు; మతియుండదు. ఆతనిశక్తి యుక్తులన్నియు మందగించి పట్టిజడుడై పోవును. కాన పురుషవరేణ్యులారా! జాగ్రత్త. ముందువెనుక లాలోచింపక చదువుకొనిన భార్యలకొఱకు సంబరాలు పడకుడు. వారిని సభలకు సమాజములకు పంపవలెనని యుబలాటపడకుడు. వారేవిధముగను ఉన్నతికి రావలయునని అభిలషింపకుడు. ఇంతవఱకు జరిగిన ఉపేక్షకే యుగయుగములనుండి స్త్రీలపై మనకుగల అధికారములు సడలబోవుచున్నవి. హక్కులూడబోవుచున్నవి. బాధ్యతలు తొలగబోవుచున్నవి. ఈ స్త్రీ యొక్క 'సర్వసామ్యములునావి' అని ఏ పురుషుడుగాని యిక తన భార్యనుగూర్చి చెప్పకొనజాలడు సుమా. స్త్రీలలో ఆ విధముగా విశృంఖలత మేరమీరి పోవుచున్నది సుమా! ఇకనైన స్త్రీ విద్యాప్రచారము నుజ్జగింపుడు. వారికి పాఠశాలలను కలాశాలలను పెట్టించుటకు ప్రయత్నింపకుడు. వారు సభలకు వెళ్లుటకుగాని క్లబ్బులలో జేరుటకుగాని సమ్మతింపకుడు. వారి విద్యావివేకాదుల నేమాత్రము హర్షింపకుడు, గౌరవింపకుడు. మఱియు మీ విద్యావివేకాదులను, వారిపై కథలను, కావ్యములను, నాటకములను, గేయములను గీతములను విరచించి అవహేళనము చేయుటకు వినియోగించుడు. స్త్రీని యే మాత్రము తలనెత్తనిచ్చినను మనకు మొప్పము వాటిల్లుట తథ్యము. వెనుక ప్రజాపాలక సంస్థలలో వారి ప్రాతినిధ్యము నేమాత్రము నంగీకరింపకుడు. చట్టసభలలో వారికి అనుకూలమగు బిల్లులేవి వచ్చినను అచ్చట అధిక సంఖ్యాకబలము మనదే గనుక వానిని గట్టిగా నెదిరించి ఓడించుడు. స్త్రీలయెడ మాతృత్వగౌరవమును, సోదరీ భావమును జూపవలయుననుట పూర్వపు విషయము. ప్రస్తుతము చేయదగినపని స్త్రీలను పరిహసించుటగాని, గౌరవించుటగాదు.

కల్పలతా! ఈ విధమగు ప్రచారము దేశములో జరుగుచుండుట నేనును గమనించుచున్నాను. స్వాతంత్ర్యవాదులనిన ప్రభుత్వము వారికున్నభయము కంటె, విద్యావతులగు స్త్రీలనిన, మగవారికి కలుగుచున్న

భయము అధికమైనదిగ కన్పట్టుచున్నది. అందువలననే స్త్రీలపై, స్త్రీ సంస్థలపై, స్త్రీ సమ్మానములపై నిందాత్మకములగు రచనలు సాగించి తమ అసూయతను ప్రకటించుచున్నారు.

ఈ ఈర్ష్యాగ్రస్తతచే, స్త్రీలయెడ సహజముగా తాము జూపవలసిన మర్యాదను విస్మరించుచున్నారు. దుష్టలగు స్త్రీలకు తగినశాస్తి చేయుచున్నామని మురియుచున్నారేగాని, యోగ్యలగు సాధ్వీరత్నముల కెందరకు మనఃఖేదము గలిగించుచుంటిమో అని యూహించుటలేదు. దుష్టమగునిట్టి భావప్రచారము వలన లలిత హృదయులగు యువకులలోనెట్టి దురభిప్రాయములు పడిపోవునో, తన్మూలకముగా ఉన్నతవిద్య నభ్యసించుచున్న బాలికల భావ్యభివృద్ధి కెట్టినిరోధము వాటిల్లునో వారు గమనించుటలేదు. నెమలికంట నీరుగారిన వేటగాని కేమినొప్పి. ఎద్దుపుండు కాకికి ముద్దా? ఇది అంతయు వారికి తమాషా, కులాసా. వారి కేమనినను మనలనేమి జేయగలరని ధిలాసా. అయినను మగవారిలో నింత అసహనము, ఆందోళనము బయలు దేరుటకు కారణము కన్పడదు. ఎన్నిమారులు లెక్కపెట్టినను మనదేశములో చదువుకొనిన స్త్రీలు నూటికిద్దరైనను లేరు. వీరిలో నామమాత్రముగా గాక బాగుగా చదివినవారు వేయింటి కొకరైనను ఉండరు. వీరిలో ఆంగ్లభాషనుగూడ బాగుగా నేర్చినవారు పదివేల కొక్కరైనను గానవచ్చుటరిది. ఆ చదువుకొనినవారందఱు పెనిమిటిచే నూడిగము చేయించుకొనువారే యనుట మానవ సహజమైన బుద్ధిలక్షణమునకే వ్యతిరేకము. ఇక ఈ కొలదిమందికొఱకై అసంఖ్యాక నారీహృదయములు చింతా వ్యాకులితమగునట్లు లసంఖ్యాక విద్యాధిక బాలికలకు ప్రబలాపకారము జరుగు చందమున రచనలుసాగించి లేఖినినేల కళంకిత మొనర్చుకొనవలయునో, దురూహ్యము. అయిననేమి, వీనికి మనము చింతింపరాదు. వారిని నిందింపరాదు. మన మహిళాభ్యుదయత్నమును విరమింపరాదు. మనము చక్కనిమార్గములో, అవక్రమైన పద్ధతిలో, ప్రేలుజూపరాని నడవడిలో మన స్త్రీ సంఘాభివృద్ధికై పాటుబడుటయే కర్తవ్యము. పై వ్యతిరేక ప్రచారమంతయు మనలో నిట్టి కార్యదీక్షను పురికొల్పుటకే సహాయపడునేని ఈ సోదరులెల్లరు మనకు మేలుచేసినవారే యగుదురు.

భావపురి
1_4_41.

మిత్రురాలు
శారద

